క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోనేరుసెంటర్: బందరు మండలం చిన్నాపురం, వాడపాలెం విద్యుత్ సబ్ స్టేషన్లకు వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.భాస్కరరావు తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

బీఎల్వోలతో సమీక్ష

పెడన: సార్వత్రిక ఎన్నికలకు సమయం లేదని, ఓటర్ల మార్పులు, చేర్పుల విషయంలో ఒకటికి రెండుసార్లు దరఖాస్తులను పరిశీలించుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్మన్ పి.వెంకటరమణ చెప్పారు. ఆయన మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం పట్టణానికి చెందిన బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ పోలీంగ్ బూత్‌లో మరొకసారి కనీస వసతులను సరిచూడాలన్నారు. బూత్‌కు వచ్చే ఎన్నికల నిర్వహణ సిబ్బందికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత కూడా మీదేనని, అందుకు చర్యలు తీసుకునేందుకు ముందు నుంచే ప్లాన్ చేయాలని సూచించారు. సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్, ఏఈఆర్వో కె.రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, టీపీవో ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్ సుందరం, బీఎల్వోలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పెడన: ఆర్టీసీ విజయవాడ రీజియన్ చైర్మన్ పిన్నింటి మహేష్ గురువారం పెడన పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కటకం ప్రసాద్ దంపతులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. వారు మహేష్‌ను కూడా సత్కరించారు. వీరితో పాటు కౌన్సిలర్ తిప్పా లక్ష్మీ నరసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరు శ్రీనివాసరరావు, వన్నం రామారావు తదితరులు ఉన్నారు.

వివాదాస్పదంగా పోతురాజు ఆలయ శంకుస్థాపన

పెడన: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ పోతురాజు స్వామి దేవస్థానం శంకుస్థాపన వివాదాస్పదంగా మారింది. గురువారం ఉదయం ఎటువంటి అనుమతులు లేకుండా ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపనకు సిద్ధమైన వారిని మున్సిపల్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. మున్సిపల్ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ టి.సూర్యశ్రీనివాస్ శంకుస్థాపన చేయకుండా నిలువరించారు. టౌన్ ప్లానింగ్, కమిషనర్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అదే సమయంలో ఆ దేవాలయం మాది అంటూ పట్టణానికి చెందిన మరికొందరు అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పేలా కనిపించింది. అక్కడే ఉన్న ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ ఇరువర్గాలకు సర్దిచెప్పి పెద్దల సమక్షంలో శాంతియుతంగా నిర్ణయించుకోవాలని, ఇక్కడ నుంచి వెళ్లిపోవాలనడంతో అంతా వెళ్లిపోయారు.

తుమ్మలకు నివాళి



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలపాలెంలో విద్యా, సాహితీ, సామాజికవేత్త తుమ్మల వేణుగోపాలరావు 96వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ జీవి రామకృష్ణ.. వేణుగోపాలరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుమ్మల వేణుగోపాలరావు వికాస కేంద్రం నిర్వాహకులు మూల్పూరి నారాయణరావు, బంధువులు, స్థానికులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



చల్లపల్లి: చల్లపల్లి – నడకుదురు ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా మారిన ముళ్ల పొదలను తొలగించారు. నడకుదురు రోడ్డులోని రాముడుపాలెం డొంక సమీపంలో మలుపు నుంచి రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయి. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పురిటిగడ్డకు చెందిన చంద్ర అజయ్ బాబు చొరవ తీసుకుని జేసీబీతో కంప తొలగించారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు, వికాస్

అవనిగడ్డ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, పలు రకాల సర్టిఫికెట్లు, పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పాత్ర చాలా ముఖ్యమైందని చెప్పారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు దేశానికే ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను ఎమ్మెల్యే సింహాద్రి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్ అందించారు. ఎంపీడీవో మరియాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుముచ్చు ఉమ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఈవో పీఆర్‌డీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ వైభవోత్సవాలు



వైభవంగా జరిగిన సహస్ర లడ్డూ పూజ

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని భక్తసమాజం, శ్రీగాయత్రీ సేవా ట్రస్ట్ (నల్లూరు-రేపల్లె) ఆధ్వర్యాన స్థానిక రామాలయంలో మూడు రోజులు పాటు జరిగే శ్రీరామ వైభవోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 41రోజుల వేడుక పురస్కరించుకుని చేపట్టిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం తొలుత విఘ్నేశ్వరపూజ, దీపారాధన, పుణ్యాహవచనం చేశారు. తదుపరి ట్రస్ట్ నిర్వాహకుడు, వేద పండితుడు పూజ్య గురూజీ ఆరేమండ చక్రవర్తి బ్రహ్మత్వంలో భద్రాద్రి మాదిరి శ్రీలక్ష్మణ సమేత శ్రీసీతారాముల విగ్రహాలకు సహస్ర లడ్డూక పూజ, విశేష తులసీ దళాల అర్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరికూటివారి పాలెం(రేపల్లె) శ్రీసీతారామాంజనేయ భక్త సమాజం సభ్యులు భజన, భక్తిగీతాలపన చేశారు. ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు సబ్బనేని పద్మజ, తలశిల నాగలక్ష్మి పర్యవేక్షణలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



ఉత్తరపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న విక్టర్ ప్రసాద్ తదితరులు

ఉత్తరపాలెం(మోపిదేవి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఉత్తరపాలెం గ్రామంలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత వెలగపల్లి కృష్ణమూర్తి సంతాపసభలో పాల్గొని, ఆయన తనయుడు ఏపీ న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావును పరామర్శించారు. ఏబీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, ప్రయివేటు టీచర్స్, లెక్చరర్ల అధ్యక్షులు బట్టు శ్యామ్ ప్రసాద్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, కనపర్తి రాజారావు, మాతంగి అనూప్, పుట్టి శ్రీనివాస్, సీహెచ్ కిషోర్, లాయర్ పులి శ్రీనివాసరావు, బొబ్బర్లంక రమేష్, దాసి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పెదప్రోలులో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



మెరకనపల్లి రామాలయంలో సామూహిక కుంకుమార్చన

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలులో శ్రీ దుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన వేదపండితులు మణిదీప్ శర్మ బ్రహ్మత్వంలో నవగ్రహ పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల పలుగ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

రామాలయంలో సామూహిక కుంకుమార్చన

మండలంలోని మెరకనపల్లి కోదండ రామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన గురువారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు దేవస్థానం తరఫున అమ్మవారి పంచలోహ రూపులు అందజేశారు.

కొనసాగుతున్న గంగానమ్మ జాతర



గంగానమ్మ జాతరలో మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు

పామర్రు: కోరిన వారికి కొంగు బంగారమైన గంగానమ్మ తల్లి జాతర మహోత్సవం గురువారం నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయం వద్ద నుంచి అంగరంగ వైభవంగా మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఘటం కుండకు ప్రత్యేక పూజలు చేసి చద్ది నివేదనలను సమర్పించి మొక్కుబడులను తీర్చుకున్నారు. పోతురాజు గడకు నూతన వస్త్రాలను సమర్పించి పసుపుతో ఓలలాడించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. గ్రామంలోని 7,8,9,10 వార్డుల్లో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. కార్యక్రమంలో 8వ వార్డు మెంబరు ఆరేపల్లి శ్రీహరి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, సభ్యులు నందిపాటి బాలసుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, డి.బాలవెంకటేశ్వరరెడ్డి, బి.రాజేష్‌రెడ్డి, గుజవర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు



కృత్తివెన్ను: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరుగుతున్న ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను గురువారం సంగమూడి ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు కృష్ణా జిల్లా లీడ్ మేనేజర్ జయవర్ధన్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పొదుపు లక్షణాలు అలవాటు చేసుకోవాలన్నారు. ఈ విధానం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దీనిపై పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజరు అజయ్‌కుమార్, హెచ్‌ఎం పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వనమహోత్సవం



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు ఆలయ ప్రాంగణంలో కోయంబత్తూరు నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన కొబ్బరిమొక్కలు నాటారు. ఈ చెట్లు మూడు సంవత్సరాల్లో కాపుకొస్తాయని, పదేళ్ల చేతికొస్తాయని భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో దీవి ఝాన్సీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఓటే నీ ఆయుధం



మోపిదేవి: రిక్షావాలాలకు టాప్ కవర్లును అవనిగడ్డకు చెందిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఓటే నీ ఆయుధం.. ఓటరా మేలుకో... అవినీతి అంతం మనందరి కర్తవ్యం...తాగుడికి బానిస కావద్దు... జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ టాప్ కవర్లపై ముద్రించి పంపిణీ చేశారు. బెల్లంకొండ ఏడుకొండలు, కోసూరు రామాంజనేయులు, విశ్వనాథపల్లి వేణు, రాజులపాటి నాగేశ్వరావు, తోట నరసింహా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపోరు యాత్ర

మచిలీపట్నంటౌన్: నగరంలో బీజేపీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్ర ప్రచార కార్యక్రమం గురువారంతో ముగిసింది. నగరంలోని దేవునితోట ఎస్టీ కాలనీలో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పాలనలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న మారుమూడి విక్టర్ ప్రసాద్

కోనేరుసెంటర్: ఆర్యోగానికి మించిన ఆస్తి లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం అను గ్రూప్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మనిషికి ఆరోగ్యం తప్పని సరి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా, వైద్యం, గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడం, ఆరోగ్య సురక్ష కార్డులు జారీ చేసి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించడం, పేదలకు స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యతలు తెలుస్తున్నాయన్నారు. ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి మాట్లాడుతూ 1,600 వందల మంది పిల్లలు విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తుంటే ఇక్కడ ఆసుపత్రి సౌకర్యం లేని విషయాన్ని గుర్తించిన తాను వెంటనే స్టాఫ్ నర్స్‌ను నియమించి వారంలో ఒకరోజు ప్రముఖ వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కృష్ణ, పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎన్.ఉష, చిలకలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, అను గ్రూప్ హాస్పిటల్స్ వైద్యులు ప్రసంగించారు. తొలుత మెగా వైద్య శిబిరాన్ని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు స్వరూప, రవి, సేషా రెడ్డి, గోపి, కవిత, సుజయ్, శాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రారంభానికి సిద్ధం

- అవనిగడ్డలో మహిళా సాధికారత దుకాణ సముదాయం
- రూ.1.05 కోట్లతో 24 షాపుల నిర్మాణం
- వారం రోజుల్లో ప్రారంభోత్సవం



నిర్మాణం పూర్తయిన మహిళా సాధికార దుకాణ సముదాయం

అవనిగడ్డ: స్థానిక డీఎస్పీ కార్యాలయం రోడ్డులో నిర్మిస్తున్న మహిళా సాధికారత దుకాణ సముదాయం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.1.05 కోట్ల జిల్లా పరిషత్ మహిళా సాధికార నిధులతో నిర్మిస్తున్న భవన సముదాయానికి ఆగస్ట్ 22, 2022లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. బ్యాంకుల సెంటర్, డీఎస్పీ కార్యాలయం రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం పక్కన ప్రధాన రహదారి వద్ద నిర్మించిన ఈ షాపులకు డిమాండ్ ఉంది. మొత్తం 24 షాపులు నిర్మిస్తుండగా మహిళలకు మాత్రమే అద్దెకిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటి ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన పెంపొందించుకునేలా చూస్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికార స్ఫూర్తితో వారి ఆర్థికాభ్యున్నతికి ఈ షాపులు దోహదపడనున్నాయి. అవనిగడ్డలో గతంలో ఎన్నడూ ఇన్ని షాపులు నిర్మించలేదు. రానున్న రోజుల్లో ఈ సెంటర్ మరింత రద్దీగా మారే అవకాశం ఉంది. నెలాఖరుకు ఈ షాపులను ప్రారంభించాలని అనుకున్నా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బిజీగా ఉండటం, ఇతర కారణాల నేపథ్యంలో వాయిదా పడింది. మార్చి మొదటి వారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ చెప్పారు. మహిళా సాధికారత కోసం మహిళలు నిర్వహించుకునేలా నిర్మిస్తున్న ఈ షాపులకు పెద్ద మొత్తంలో నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సింహాద్రికి, జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు జెడ్పీటీసీ చింతలపూడి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి



యోగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న నాగకుమారి తదితరులు

పెడన: ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని, గుర్తింపు తెచ్చుకోవడం గొప్ప విషయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. పెడన పురపాలక సంఘ మేనేజర్ వాసా యోగేశ్వరరావు పదవీ విరమణ సత్కార సభలో గురువారం ముఖ్యఅతిథి నాగకుమారి మాట్లాడారు. యోగేశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మాజీ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, కౌన్సిలర్లు బల్ల పద్మావతి, తిప్ప లక్ష్మీ నరసమ్మ, మెట్ల గోపీ ప్రసాద్, కొసనం కరుణకుమారి, మెట్ల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, పురపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఈఓపీఆర్డీ సూరపనేని నవరత్నం ఉద్యోగ విరమణ, వీడ్కోలు కార్యక్రమం గురువారం జరిగింది. రాజామణి, రామ్మోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నవరత్నంను ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు పెనుమత్స రాధిక, నిమ్మగడ్డ ప్రభుదాస్, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, వివిధ గ్రామాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పెనమలూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు అన్నారు. పోరంకిలో గురువారం హ్యాపీ మైండ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వారు సంయుక్తంగా మినీ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జాబ్‌మేళాలో 31 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నియామక అధికారి మధు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యాన నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం జరిగింది. జిల్లా అధికారి సుంకర రాము అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ యువత దేశ నిర్మాణానికి తమను తాము అంకితం చేసుకోవాలని చెప్పారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని రాజకీయాల్లో రాణించాలన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అల్లు మురళి, శంకర్‌నాథ్, డాక్టర్ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

మినుముకు.. బంగారుతీగ బెడద



కోడూరు మండలం నరసింహపురంలో మినుము మొక్కలకు అల్లుకున్న బంగారుతీగ

దివిసీమలో పలు ప్రాంతాల్లో మినుము పంటను బంగారుతీగ అల్లేస్తుంది. కాపు దశలో కొన్నిచోట్ల బంగారుతీగ బెడద పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో రబీలో 67,450 ఎకరాల్లో మినుము సాగుచేశారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో ఆలస్యంగా సాగుచేసిన మినుము పంటకు కొన్నిచోట్ల బంగారు తీగ ఆశించింది. కాయ పెరగక సగానికి సగం దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి, నరసింహపురం, నారేపాలెం, పిట్టల్లంక, వి కొత్తపాలెం ప్రాంతాల్లో బంగారు తీగ ఎక్కువగా కనిపిస్తోంది. మందులు పిచికారీ చేసినా బంగారుతీగ ఆగలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. –అవనిగడ్డ



కోడూరు మండలం విశ్వనాథపల్లిలో బంగారుతీగ ఆశించిన మినుము



పిట్టల్లంకలో మినుము పంటకు బంగారుతీగ